

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**హే జీరే...హే జీరే...**

**అరే, రామచంద్ర కహగయే సియాసే**

**ఐసా కలియుగ్ ఆయేగా**

**హంస్ చుకేగా దానా దున్ కా**

కవ్వా మోతీ ఖాయేగా

1970లో విడుదలయిన 'గోపి' సినిమా పెద్ద హిట్. ఈ సినిమాలో దిలీప్ కుమార్ నటన బహు ప్రశంసలు పొందింది. అమాయకుడయిన నీతిపరుడిపై చేయని దొంగతనం నేరం మోపి ఊర్లోంచి వెళ్లగొడితే, పట్నం వచ్చి తెలివిమంతుడై డబ్బు సంపాదించి తిరిగి ఊరొచ్చి ప్రతీకారం తీర్చుకోవటం సినిమా కథ. ఈ సినిమాలో హీరో దైవభక్తి, నిజాయితీలు చూపించేందుకు రెండు పాటలుంటాయి. ఒకటి 'సుఖ్ కే సబ్ సాథీ దుఖ్మే న కోయ్' మహమ్మద్ రఫీ పాడిన ఈ పాట ఎంతో ప్రజాదరణ పొందిన భక్తిగీతం. దీనితోపాటుగా, గోపీకీ, అన్నకూ నడుమ ఉన్న సంబంధాన్ని తెలుపుతూ, కలియుగం ఎలా ఉండబోతుందో, రాముడు సీతకు చెప్పినట్టు ఓ పాట ఉంటుంది. ఆధునిక సమాజంలో దిగజారుతున్న విలువలు, మానవ సంబంధాలపై విసురు ఈ పాట. మహేంద్ర కపూర్ పాడిన ఈ పాట అత్యంత ప్రజాదరణ పొందటమే కాదు గొప్ప 'భజన'గా గుర్తింపు పొందింది. అనూప్ జలోటాలాంటివారు సైతం ఈ పాటను పాడారు 'భజన'గా.

నిజానికి ఇది రామాయణంలో కథ కాదు. వీధివీధుల్లో, పల్లెల్లెల్లోకి రామాయణం పాకినప్పుడు, చేదు నిజాలు చెప్పేందుకు, సమాజానికి నిజానిజాలు తెలిపి దిశానిర్దేశనం చేసేందుకు, రాబోయే కష్టాలను ఎదురుకునేందుకు మానసికంగా సిద్ధం చేసేందుకు, రామాయణంలో రాముడిలా అన్నాడు అని చెప్పటం ఒక ఆనవాయితీ. అది ఆకర్షణీయంగా ఉండి, ప్రచారం పొందితే కొన్నాళ్ళకి అది స్థానిక రామాయణంలో భాగమైపోతుంది. తెలుగులో

‘రాముడేమన్నాడోయ్’ అని ఒక పాట ఉంది. నిజానికి అది రాముడు చెప్పలేదు. మనమే సందర్భానికి తగ్గట్టు రాముడి పేరుమీద మన అభిప్రాయాలు, ఆలోచనలు చెప్తామన్నమాట. ఈ పాట అలాంటిదే. అందుకే చివరలో, పాత్ర తనపేరు చెప్పుకుంటుంది.

'గోపి' సినిమాలో పాటలు రాసింది రాజేందర్ క్రిషన్. రాజేందర్ కిషన్ ఒక అద్భుతమైన గేయ రచయిత. సంభాషణల రచయిత. స్క్రిప్టు రచయిత. ఆయన అన్ని రకాల పాటలు రాశాడు. ఉర్దూ ఘజల్స్ రాశాడు. శుద్ధ హిందీలో గీతాలు రాశాడు. తాత్వికలోతున్న పాటలు రాశాడు. అల్లరి చిల్లరి పాటలూ రాశాడు. ఎప్పుడూ పాటలలో తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించాలని ప్రయత్నించలేదు. పాటను తన వ్యక్తిత్వంతో డామినేట్ చేయాలని తపన పడలేదు. అందుకే ఆయన గీతాలను పరవశించి పాడుకునేవారికి కూడా ఆ పాట రాసింది రాజేందర్ క్రిషన్ అని తెలియదు. అలాంటి గీతాలలో 'రామచంద్ర కహగయే సియాసే' అన్న పాట కూడా ఒకటి. ఈ పాటకు సంగీత దర్శకత్వం వహించింది కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ.

రామచంద్రుడు సీతతో కలియుగం ఎట్లా ఉంటుందో చెప్తాడు. అదీ పాట.

హో జీరే అంటే అవును. ఇలాగే ఉంటుంది. లేక ఇలాగే అవుతుంది అని అర్థం చెప్పుకోవాలి.

సీతతో రాముడు ఇలాంటి కలియుగం వస్తుంది. ఎలాంటిదంటే హంస గింజల పొట్టు తింటుంది. కాకి ముత్యాలు భోంచేస్తుంది అని. అలాంటి కలియుగం వస్తున్నది అని చెప్తున్నాడు రాముడు.

కానీ పాటలో పదాలను జాగ్రత్తగా గమనిస్తే, రాముడు సీతను విడిచి వెళ్లేముందు ఇలా చెప్పి వెళ్లాడు అన్న అర్థం వస్తుంది. 'చుగేగా' అన్న పదం ముక్కుతో తినే పక్షులకోసం వాడతారు. 'దానా – దున్ కా' అన్న పదం గమ్మత్తయినది. 'దాన' అంటే గింజలు. బియ్యంగింజలు లాంటివి. దున్‌కా అంటే పొట్టు. అంటే హంస గింజల పొట్టు తింటుంది అని అర్థం. సాధారణంగా, మన పురాణాల్లో హంస ముత్యాలను తింటుంది. పాలను నీటిని వేరు చేయగలుగుతుంది. మామూలుగా హంసలు నీటిలో చేపలు, నాచు మొక్కలు వంటివి తింటాయి. కానీ మానస సరోవరంలో ఉండే హంసలు ముత్యాలను తింటాయి. కానీ కలియుగంలో హంసలు గింజల పొట్టు తింటాయి, కాకులు ముత్యాలు తింటాయి.

ఇక్కడ ప్రతీకాత్మకంగా చెప్తున్నదేమిటంటే, అర్హత ఉన్నవాడు, అర్హతలేని వాడికి ఊడిగం చేస్తాడు. అర్హత లేనివాడు అందలాలెక్కుతాడు అని.

**సియానే పూఛా, కలియుగ్ మే ధర్మ ఔర్ కర్మ్ కో కోయీ నహీ మానేగా?**

సీతాదేవి రాముడిని అడిగింది, 'కలియుగంలో ధర్మాన్ని, కర్మాన్ని ఎవ్వరూ ఆమోదించరా?' అని.

తో పర్భూ బోలే.. అప్పుడు ప్రభు శ్రీరామచంద్రుడు సమాధానం ఇచ్చాడు.

**ధరం భీ హోగా, కరం భీహోగా పరంతు షర్మ్ నహీ హోగా**

**బాత్ బాత్ మే మాతా – పితాకో బేటా ఆంఖ్ దిఖాయేగా.**

సీత ప్రశ్నకు సమాధానంగా రాముడు, ధర్మం ఉంటుంది, కర్మం ఉంటుంది కానీ 'సిగ్గు' అనేది ఉండదు. మాట మాటకీ సంతానం తల్లిదండ్రులపై కళ్లెర్ర చేస్తుంది అంటాడు. 'ఆంఖే దిఖానా' అంటే కోపం ప్రదర్శించటం, లెక్క చేయకపోవటం, ఎదురు జవాబివ్వటంవంటి అర్థాలొస్తాయి. సిగ్గులేకపోవటం గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పుకోనవసరంలేదు.

ధర్మం ఉంటుంది. కర్మం ఉంటుంది. మాతృదేవోభవ. పితృదేవోభవ. ఆచార్యదేవోభవ.  ఇది ధర్మం. అదెక్కడా పోదు. దాన్ని ఆచరించటం 'కర్మ' అదెక్కడా పోదు. కానీ ఆచరించే వాళ్లే ఉండరు. పెద్దలను గౌరవించటం ధర్మం. కానీ వ్యక్తిగతానికి ఇచ్చిన ప్రాధాన్యం సమాజానికి ఇవ్వకపోవటంతో ధర్మం పాటించే వారుండరన్నమాట. ఇప్పుడిది మనం అనుభవిస్తున్నాం. తల్లిదండ్రులను గౌరవించని వారు, ఇతర పెద్దలను గౌరవించరు. పూర్వికులను గౌరవించరు. చివరికి తమను తాము గౌరవించుకోలేరు. అందుకే 'సిగ్గు' అన్నది తెలియని తరాలు, స్వార్థం తప్ప గౌరవించని లజ్జ రహిత తరాలు మనం చూస్తూనే ఉన్నాం. సినిమాల్లో టీచర్లు ఎంత జోకర్లో నిజజీవితంలోనూ అంతగా విలువల్లేనివారు అవుతున్నారు.

**రాజా ఔర్ ప్రజాదోనోమే హోగి నిస్ దిన్ ఖేంచా తానీ**

**కదం కదం పర్ కరేంగే దోనో ఖుద్  – అప్నీ మన్ మానీ**

**జిస్ కీ హాథ్ మే హోగీలాఠీ భైంస్ వహీ లేజాయేగా**

ఇది ఇప్పుడు మనం అనుభవిస్తున్నదే. పాలకులకూ – ప్రజలకూ నడుమ రోజూ గొడువలవుతూనే ఉంటాయి, ఏదో విషయం ఆధారంగా. ఎవరికి వారు అడుగడుక్కీ తమ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తుంటారు. పెద్దగా వివరణ అవసరం లేకుండా సులభంగానే అర్థమైపోతుంది. ముఖ్యంగా మనం అనుభవిస్తున్నదే. ఇటీవలి కాలంలో, ముఖ్యంగా సోషల్ మీడియా విస్తృతమైన తరువాత ప్రతి ఒక్కడూ పెద్దా చిన్నా లేకుండా ప్రతి ఒక్కరినీ వారి స్థాయితో సంబంధం లేకుండా ఎంత పడితే అంత అనటం చూస్తూనే ఉన్నాం. అలాగే, డబ్బు, అధికారం ఉన్నవాడు ఏం చెపితే అదే వేదం. ఏం చేస్తే అదే అనుసరణీయం అవటం చూస్తున్నాం. తుపాకీ ఎవరి చేతిలో ఉంటే, వాడిదే అధికారం.

**సునోసియా కలియుగ్ మే కాలా ధన్ ఔర్ కాలేమన్ హోగే**

**చోర్ ఉచక్కే నగరసేఠ్, ఔర్ ప్రభు భక్త్ నిర్ధన్ హోగే**

**జో హోగా లోభీ ఔర్ భోగీ వో జోగీ కహలాయేగా.**

ఈ పాట 1970 నాటిదయినా ఇప్పటి సమాజం కళ్లముందు కనబడుతుంది. సీతా ఇంకా విను. కలియుగంలో నల్లధనం, దుష్ట హృదయాలుంటాయి. దొంగలు, దోపిడీ దార్లు పెద్దలు, ఐశ్వర్యవంతులవుతారు. దైవ భక్తులు నిర్ధనులవుతారు. ఎవరయితే లోభులు, భోగలాలసులు అవుతారో, వారిని యోగులని అంటారు. ఇదీ మనం చూస్తూనే ఉన్నాం. పైకి త్యాగధనులు, అవతారాలు, అవధూతలు.. కానీ వారి ఆశ్రమాలలో భోగాలు ఎంతో ఐశ్వర్యవంతులు కూడా అనుభవించలేనివి. కానీ అంతా యోగులుగా ప్రజల మన్ననలందుకుంటారు. దొంగలు నగరాధిపతులవటం కూడా మనం రోజూ అనుభవిస్తున్నాము.

**మందిర్ సూనా సూనా హోగా భారీ రహేంగీ మధుశాలా**

**పితాకే సంగ్ – సంగ్ భరీ సభామే నాచేంగీ ఘర్ కీ బాలా**

**కైసా కన్యాదాన్ పితాహీ కన్యా కా ధన్ ఖాయేగా**

ఇదీ మనం అనుభవిస్తున్నదే. మందిరాలు నిర్మానుష్యంగా ఉండటం, మద్యపానశాలలు, మద్యం అమ్మే దుకాణాల ముందు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేంత జనం ఉండటం చూస్తూనే ఉన్నాం. ఒకప్పుడు వీధి వీధికీ మందిరాలుండేవి. ఇప్పుడు వీధి వీధికీ మధుశాలలంటున్నాయి. అవన్నీ రాత్రి పగలు లేకుండా ఎప్పుడూ జనసమ్మర్ధంగానే ఉంటున్నాయి. ఇక

తండ్రితో కలసి, కూతురో, కోడలో నృత్యాలు చేయటం కూడా చూస్తున్నాము. కవి ఘర్ కీ బాలా అన్నాడు. అంటే, ఇంటి మహిళ,స్త్రీ, యువతి అన్న అర్ధాలొస్తాయి. ఆ మధ్య 'బంటీ ఔర్ బబ్లీ ' సినిమాలో అమితాబ్, అభిషేక్‌ల నడుమ ఐశ్వర్యారాయ్ 'కజ్‌రారే' పాటకు నృత్యం చేస్తూ, చివరలో అభిషేక్ కన్నా అమితాబ్ మిన్న అని తేల్చటం చూసి 'సూపర్ హిట్' చేసే దుస్థితినీ అనుభవించాం. (సినిమా అని కొట్టేయటం పొరపాటు) ఇటీవలి కాలంలో స్టేజీల మీద తండ్రులూ, కూతుళ్లూ, కోడళ్లూ, మామలూ, అత్తలూ, అల్లుళ్లూ అందరూ అడ్డమైన పాటలకు గెంతులు వేయటం చూస్తూనే ఉన్నాం. చివరికి టీచర్లూ, స్టూడెంట్లూ కూడా స్టేజీల మీద వెర్రెక్కి నృత్యాలు చేయటం సాధారణం అయిపోయింది. అయిదారేళ్ళ పిల్లలతో కూడా స్కూళ్ళల్లో పిచ్చి దుస్తులూ, వెర్రి గెంతులూ వేయించి మురిసిపోవటం సాధరణం అయింది. అందుకే 'కన్యాదాన్ అన్న మాట పోయింది. ఇప్పుడు 'కన్యా ధన్' వెంట పడుతున్నారని రాముడు, సీతతో అన్నాడట. ఉద్యోగం చేసే భార్య కావాలని కోరటం నుంచి, భార్య ఉద్యోగం చేస్తున్నది కదా అని తాను ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోవటం వరకూ, స్త్రీ కన్నా స్త్రీ ధనమే మిన్న అయిన కాలంలోనే ఉన్నాం మనం.

**మూరఖ్ కీ ప్రీత్ బురీ, జూయే కీ జీత్ బురీ**

**బురే సంగ్ బైర్ చైన్ భాగే హీ భాగే.**

మూర్ఖుడితో స్నేహం, జూదంలో గెలుపు, చెడ్డవి – చెడ్డవారితో కలిస్తే శాంతి పారిపోతుంది.

**కాజల్ కీ కోఠరీ మే కైసోహీ జతన్ కరో**

**కాజల్ కా గా దాగ్ భాయీ లాగే హీలాగే.**

ఇక్కడ 'కాజల్' అన్న పదాన్ని విభిన్నమైన అర్ధంతో వాడాడు. మసి, నిండిన గదుల్లో దూరితే, ఎంత ప్రయత్నించినా మచ్చ అంటి తీరుతుంది. 'కాజల్' అంటే కాటుక అన్న అర్ధం ప్రచారంలో ఉంది. దీపం వల్ల ఏర్పడే నల్లటి మసిని కూడా కాజల్ అంటారు 'కాజల్' అంటే కాటుక, బూడిద అన్న అర్ధాలు వస్తాయి. అంటే చెడు పనులు చేస్తే దోషం అంటక తప్పదన్నమాట.

**కిత్ నా జతీ హో కోయీ, కిత్ నా సతీ హో కోయీ**

**కామినీ కె సంగ్ కాం జాగే హీ జాగే**

ఎంత యతి అయినా, ఎంత పతివ్రత అయినా కాముకుల వెంట ఉంటే కామం జాగృతం అవుతుంది.

**సునో కహే గోపీరాం జిస్కా హై నాం, కాం**

**ఉస్ కాతో ఫంద గలే లాగేహీ లాగే.**

**హోజేరే..**

విను గోపీరాం చెప్పినది జరిగి తీరుతుంది. వాడి మెడకు ఉచ్చు పడితీరుతుంది. పాట చివరలో అల్లరికి అన్నా, పాట అయిన తరువాత చేయని దొంగతనం నేరం హీరో గోపీరాం మెడకు చుట్టుకుంటుంది.

ఈ చివరి మాట చెప్పటానికి ఇంత పాట రాశాడు గేయ రచయిత, సందర్భం సృష్టించాడు స్క్రిప్టు రచయిత. ఇది కలియుగం, ఇందులో అమాయకుడే ఇరుక్కుంటాడు, బలి అవుతాడు అని చెప్పే ఈ పాటలో మనం నిత్యం అనుభవిస్తున్న చేదు నిజాలను అత్యంత సూటిగా చక్కగా ప్రదర్శించాడు రాజేందర్ క్రిషన్. అందుకే ఈ పాట సృజించి యాభై ఏళ్లయినా అప్పటికన్నా ఇప్పుడు దీని ఆదరణ ఇంకా పెరుగుతున్నది. మహేంద్ర కపూర్ ఈ పాటను హుషారుగా, అలవాటయిన రీతిలో సుదీర్ఘమైన హై పిచ్ రాగాలతో పాడి అలరించాడు. అయితే, రాముడు అప్పుడే చెప్పాడు కలియుగంలో ఇలాగే ఉంటుందని నిరాశ చెందకుండా 'ఇదే సినిమాలో సుఖంలో అందరూ వెంట ఉంటారు. దుఃఖంలో ఎవ్వరూ వెంటరారు. ఎప్పుడూ వదలకుండా వెంట ఉండేది శ్రీరామచంద్రుడే. అతని నామమే సత్యం అని చెప్పే పాట కూడా రాసి, నిరాశ నుంచి వెలుతురు వైపు దారి చూపించారు కళాకారులు.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story